క్లుప్తంగా

ఎంఈఓ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: రేకుల షెడ్లలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం ఎంఈఓలు నాగమణి, వెంకటరమేష్‌లకు వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు శశికుమార్, రాజు పాల్గొన్నారు.

ఆరోగ్యసూత్రాలు పాటించాలి



విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

రాయదుర్గంటౌన్: విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. గురువారంమండలంలోని పల్లేపల్లి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్యం, దోమలు పుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సుతోపాటు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటిస్తే జబ్బులు రావన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా శ్వాసకోశకు సంబంధించిన జబ్బులు క్షయ, స్వైన్‌ఫ్లూ, డయేరియా వంటి వ్యాధుల రక్షణ పొందొచ్చన్నారు.

రచ్చుమర్రి ఇసుకరీచ్ పరిశీలన



స్టాక్ యార్డ్‌లో ఇసుక నిల్వలపై ఆరా తీస్తున్న ఆర్డీఓ వసంతబాబు

కణేకల్లు: మండలంలోని ఇసుక రీచ్‌ను ఆర్డీఓ వసంతబాబు గురువారం పరిశీలించారు. ఇసుక రీచ్‌లో సీజ్డ్ ఇసుక పంపిణీ పూర్తవుతోంది. దీంతో ఈ ప్రాంతంలో స్టాక్‌యార్డ్‌లో ఇసుకను నిల్వ ఉంచేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్టాక్ యార్డ్‌లో ఎన్ని మెట్రిక్ టన్నుల ఇసుక తరలించారు? ఇంకా ఎంత స్టాక్ ఉంచడానికి వీలవుతుంది? అనే విషయాలను తహసీల్దార్ ఫణికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉచిత ఇసుక పంచాయతీ పరిధిలో ట్రాక్టర్, ఎడ్లబండిలో తీసుకెళ్లే వెసులుబాటు ఉందని, పంచాయతీ పరిధి దాటి ఇసుక అక్రమంగా తీసుకెళ్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

రాయదుర్గంలో భారీ వర్షం

రాయదుర్గంటౌన్: పట్టణంలో గురువారం సాయంత్రం భారీ వర్షం దంచికొట్టింది. అరగంటకుపైగా వర్షం కురవడంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన కొలిమివీధి, రామస్వామి వీధి, పాతమీసేవ, మధుటాకీస్ ఏరియాల్లోకి నీరు చేరింది. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో నీరంతా కాలనీల్లోని రోడ్లపైకి వచ్చి చేరాయి. ముంపు కాలనీలతోపాటు కణేకల్లు రోడ్డుపై పలుచోట్ల వర్షపునీరు పారింది.

వేలం పాటలో రూ.1.74 లక్షలు


కంబదూరు: కంబదూరు పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్, వారపు సంతకు జరిగిన వేలంలో రూ.1.74 లక్షల ఆదాయం వచ్చింది. గురువారం స్థానిక సర్పంచ్ పద్మావతమ్మ, ఈఓఆర్డీ గూడెన్న ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ గదులు, వారపు సంతకు వేలం నిర్వహించారు. వేలంలో రాజు అనే వ్యక్తి రూ.73 వేలకు దక్కించుకున్నాడు. షాపింగ్ కాంప్లెక్స్ గదులను రూ.101000కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


సాక్షి ఎఫెక్ట్..

గుమ్మఘట్ట: మండలంలోని రంగచేడు గ్రామంలో నిత్యావసర సరుకులను కార్డుదారులకు పంపిణీ చేశారు. గురువారం 'సాక్షి'లో డీలర్‌కు అధికారుల వేధింపులు శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన సివిల్ సప్లై అధికారులు .. గ్రామంలో రేషన్ అందించేందుకు చర్యలు చేపట్టారు.

వైభవంగా బొడ్రాయి, ధ్వజ స్తంభ ప్రతిష్ట



కదదరకుంటలో ప్రతిష్ఠించిన బొడ్రాయి



ఆలయం ముందు ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

కూడేరు: మండలంలోని కదదరకుంటలో బొడ్రాయి, ఆంజనేయ స్వామి ఆలయం ముందు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. గురువారం ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా సాగింది. భక్తి శ్రద్ధలతో బొడ్రాయి, ధ్వజస్తంభాన్ని ప్రజలు దర్శించుకున్నారు. ఆంజనేయ నామస్మరణ మార్మోగింది. అనంతరం అన్నదానం చేశారు. సీఐ శివరాముడు నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బాబోయ్... కుక్కలు



- రాయదుర్గంలోని ప్రతి వార్డులో శునకాల స్వైర విహారం
- బెంబేలెత్తుతున్న ప్రజలు, చిన్నారులు
- రోజుకు 5కుపైగా కుక్కకాటు కేసుల నమోదు

రాయదుర్గంటౌన్: వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. పట్టణంలో మొత్తం 32 వార్డులు ఉన్నాయి. ఏ వీధిలో చూసినా కుక్కలు పదుల సంఖ్యలో సంచరిస్తూ ప్రజలను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇటీవల 17వ వార్డులోని మూడేళ్ల బాలుడు అర్బాస్‌తో పాటు మరో ఇద్దరిపై దాడి చేసి తీవ్ర రక్తగాయాలు చేశాయి. ఇలా ఈ ఒక్క వార్డులోనే కాదు. ప్రతిరోజూ పట్టణంలోని ఏదో ఒక వార్డులో ప్రజలు, చిన్నారులను భయభ్రాంతులకు గురిచేస్తూ దాడి చేస్తున్నాయి.

285 కుక్క కాటు కేసులు

పట్టణంలోని అనంత గ్రామీణ బ్యాంకు వెనుక ఓ మేకపై రెండు కుక్కలు బుధవారం దాడి చేసి గాయపరిచాయి. మనుషులపైనే కాకుండా ఇలా ఇతర జంతువులపై కూడా దాడి చేసి గాయపరుస్తున్న సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. అధికారిక రికార్డుల ప్రకారం రోజుకు సగటును 5 మందికి పైగా కుక్కకాటుతో ఆస్పత్రి పాలవుతున్నారంటే కుక్కల బెడద ఏ మేరకు ఉందో తెలుస్తోంది. రెండు నెలల వ్యవధిలో నెలకు 150కి పైగా చొప్పున రెండు నెలల వ్యవధిలోనే దాదాపు 285 కుక్క కాటు కేసులు ఆస్పత్రిలో నమోదయ్యాయి.

కేబీ ప్యాలెస్ రోడ్డులో తిష్టవేసిన కుక్కలు

ఎటు చూసినా కుక్కలే...

పట్టణంలోని ప్రధాన రోడ్లతో పాటు ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. వీటిలో అనేక కుక్కలు దారిన వెళ్లే వారిని కరిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలను వెంబడిస్తుండటంతో కూడా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికంగా ఖాళీ స్థలాలు, చెత్త కుప్పలు, పేరుకుపోయిన చెట్ల సమీపంలో నివాసాలు చేసుకుని వీధుల్లో సంచరిస్తున్నాయి. కేబీ ప్యాలెస్ రోడ్డు, గొగ్గిరొట్టి, మటన్ మార్కెట్, చికెన్ మార్కెట్ ఏరియా, ఆస్పత్రి వెనుక, మొలకాల్మూరు రోడ్డు, బీటీపీ రోడ్డు, శివారు ప్రాంతాల్లో అత్యధికంగా తిష్టవేస్తున్నాయి. కుక్కల బెడద రాత్రిళ్లు మరింత అధికంగా ఉంటుందని బాధితులు లబోదిబోమంటున్నారు. రాత్రి సమయంలో రాకపోకలు సాగిస్తున్న వారిపై అధికంగా దాడులకు పాల్పడుతున్నట్లు వాపోతున్నారు.

సర్వేలో తేలిన కుక్కల సంఖ్య 820

కుక్కల బెడద రోజురోజుకు అధికమవుతుండటంతో ఇటీవల మున్సిపల్ పారిశుధ్య విభాగంలో నిర్వహించిన సర్వేలో పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ దాదాపు 820 కుక్కలు ఉన్నట్లు తేల్చారు. పట్టణంలో మొత్తం 32 వార్డులు ఉన్నాయి. అంటే ఒక్కో వార్డులో సగటును 25 కుక్కలు సంచరిస్తున్నాయి. కుక్కల బెడద నివారణకు గత మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వ్యాక్సినేషన్‌తో వాటి వృద్ధిని తగ్గించేందుకు చర్యలు తీర్మానించారు. వ్యాక్సినేషన్ ఇవ్వడంతో పాటు కుక్కలను పట్టుకుని అటవీప్రాంతంలో వదిలి బెడదను నివారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్య తీవ్రతరం కాకముందే అధికారులు చర్యలు చేపట్టి కుక్కలను తరలించాలని కోరుతున్నారు.



కుక్కల బెడద నివారించాలి



పట్టణంలో కుక్కల బెడద రోజురోజుకు అధికమవుతోంది. చిన్నపిల్లలను కరిచేందుకు ప్రయత్నించడమే కాకుండా దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇటీవల మా వార్డు పరిధిలో కుక్క దాడిలో ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలో అనేక చోట్ల రాత్రిపూట ద్విచక్ర వాహనాలపై వెళితే కుక్కలు వెంబడిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కుక్కల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మొహమ్మద్, 17వ వార్డు, రాయదుర్గం

18న కనకదాస జయంతి



ఉరవకొండలో కరపత్రాలు విడుదల చేస్తున్న బోరంపల్లి ఆంజనేయులు

ఉరవకొండ: ఈనెల 18న జిల్లా కేంద్రంలో కనకదాసు జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, సంఘం జిల్లా అధ్యక్షులు ఈశ్వరయ్య తెలిపారు. గురువారం ఉరవకొండలో కనకదాస జయంతి సభ కరపత్రాలను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ లత్తవరం గోవిందు, కురుబ సంఘం నాయకులు వసికేరి శివ, నాగేంద్రప్ప, శీనయ్య, గోవిందు ,రవి, జయరాములు, రామాంజనేయులు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జ్వాలాతోరణ దర్శన పూజలు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని శ్రీరామేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ప్రకటనలో తెలిపారు.కార్తీకమాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం జ్వాలాతోరణ పూజలు కొనసాగుతాయన్నారు. సాయంత్రం 6:30 గంటలకు జ్వాలాతోరణం ఏర్పాటు చేసి శ్రీగౌరీ దేవి పూజలను ఆలయం వద్ద నిర్వహించనున్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



ఉరవకొండలో ప్రశంసాపత్రాలతో విద్యార్థులు



శెట్టూరులో పుస్తకాలు వితరణ చేస్తున్న దృశ్యం



బొమ్మనహాళ్‌లో బాలల దినోత్సవ దృశ్యం



బెళుగుప్పలో చిన్నారులతో కలసి బాలల దినోత్సవంలో పాల్గొన్న వైద్యాధికారిణి ప్రియాంక

ఉరవకొండ: విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్, అర్బన్ ఎస్ఐ జనార్దన్‌నాయుడు అన్నారు. గురువారం స్థానిక షిర్డీ సాయి కల్యాణ మంటపంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా, ఆటల పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు. నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్ తాడికొండ మాట్లాడారు. విజేతలకు సీఐ, ఎస్ఐ బహుమతులు అందించారు.

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, సూపర్‌వైజర్ భారతి పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నెహ్రూ చిత్రపటాన్ని ఉంచి బాలల దినోత్సవం నిర్వహించారు.

బెళుగుప్ప: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గంగవరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెచ్ఎం రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. రూరల్ సీఐ చిన్న గౌస్, ఎస్ఐ శివ పాల్గొన్నారు. శీర్పి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ షర్మిళ, బెళుగుప్ప సన్‌రైజస్ పాఠశాలలో కరస్పాండెంట్ మారెన్న, పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రియాంక, విశ్రాంత ఉపాధ్యాయులు నాగరాజు, శ్రీనివాస విద్యానికేతన్‌లో కరస్పాండెంట్ శ్రీనివాసులు, హెచ్ఎం సుమ పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

శెట్టూరు: స్థానిక ఉన్నత పాఠశాల, కేజీబీవీలో బాల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ విద్యార్థులకు వశిష్ఠ 360 స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను ఎంఈఓ శ్రీధర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు అబ్దుల్ వాహబ్ ఖాన్, సాయినాథ్, ప్రధానోపాధ్యాయులు ఫిరోజ్‌ఖాన్, ఎస్ఓ లలిత, విద్యావేత్త ఎమ్మెఎస్ రాయుడు, ఉపాధ్యాయులు దివాకర్ రెడ్డి, రవిశంకర్ పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

కూడేరు: నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని సీఐ శివరాముడు సూచించారు. గురువారం కూడేరులోని వాణి స్కూల్‌లో బాలల దినోత్సవం నిర్వహించారు. ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచి విద్యార్థులకు సీఐ శివరాముడు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వాణి స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో బాలల దినోత్సవం

ఉరవకొండ: పట్టణంలోని రాజమ్మ ప్రేమ్ బందన్ చిన్న పిల్లల ఆశ్రమంలో పాస్టర్ సురేష్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఎస్ఐ జనార్దన్ నాయుడు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్టలోని ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం విశ్వనాథ్ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : స్థానిక గ్రంథాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హనుమంతరెడ్డి, రవికుమార్, గ్రంథాలయ అధికారి ఎర్రిస్వామి పాల్గొన్నారు.

నెహ్రూ అడుగుజాడల్లో నడవాలి

బొమ్మనహాళ్: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు.

కుందుర్పి: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. మాయదార్లపల్లిలో రాష్ట్ర ఉద్యోగ సంఘం అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వివిధ ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం కౌసల్య, ఉపాధ్యాయులు ధనుంజయ, అరుణ, భాగ్యరేఖ, అశోక్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు. పీసీ కొత్తకోట ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఎంఈఓ ఎర్రిస్వామి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో హెచ్ఎం శేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జీఎస్టీ బిల్లులే ఇవ్వాలి



జువారీ ఫార్మ్‌హబ్‌లో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

కణేకల్లు: ఎరువులు, మందులు, విత్తనాలు ఏవి కొనుగోలు చేసినా రైతులకు కచ్చితంగా జీఎస్టీ బిల్లులే ఇవ్వాలని వ్యవసాయశాఖ అంతర్ జిల్లా తనిఖీ అధికారి, ఉరవకొండ ఏడీఏ ఎస్.పద్మజ ఫర్టిలైజర్‌షాపు యజమానులను ఆదేశించారు. గురువారం కణేకల్లులోని జువారీ ఫార్మ్‌హబ్, లక్ష్మీనరసింహస్వామి ఫర్టిలైజర్‌షాపులను స్థానిక ఏఓ ఎ.శ్రవణ్‌తో కలిసి ఏడీఏ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఎరువుల స్టాక్ రిజిష్టర్, నిల్వలు, ఇన్వాయిస్, ఫారం 'ఓ' (అనుమతి పత్రాలు)లను అధికారులు పరిశీలించారు. జువారీ ఫార్మ్‌హబ్‌లో రెండు కంపెనీలకు చెందిన ఐదు రకాల ఎరువులకు అనుమతి పత్రాలు లేకపోవడంతో ఎరువుల విక్రయాలు చేయకుండా నిలుపుదల చేశారు. 99 కేజీ పొడి ఎరువు, 240 లీటర్ల ద్రవ్య ఎరువు (నానో డీఏపీ) విక్రయించరాదని అధికారులు ఆదేశించారు. వీటి విలువ రూ.4,09,835లని ఏడీఏ, ఏఓలు తెలిపారు.

వజ్రకరూరులో ఫర్టిలైజర్స్‌షాపుల తనిఖీ..

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను ఏడీఏ వెంకటరాముడు ఆధ్వర్యంలో గురువారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని మహబూబ్ ట్రేడర్స్, మనగ్రోమోర్ సెంటర్, భాషా ఫర్టిలైజర్ –పెస్టిసైడ్స్, వజ్రకరూరు ఎస్‌పీఓ తదితర షాపులను తనిఖీలు నిర్వహించారు. స్టాక్‌పుస్తకం, డీబీటీ, ఈపాస్ మిషన్లు, రికార్డులు పరిశీలించారు. ఎమ్మార్పీకంటే అధిక ధరలకు విక్రయించరాదని ఏడీఏ వెంకటరాముడు హెచ్చరించారు. ఏఓలు మధుకర్, శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



ఉరవకొండలో మాట్లాడుతున్న ఎంఈఓ ఈశ్వరప్ప

రాయదుర్గంటౌన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నుంచి పట్టణంలోని గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

కంబదూరు: గ్రంథాలయాలు విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే విజ్ఞాన కేంద్రాలు అని గ్రంథాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యంబాబు అన్నారు. మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహించారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జ్ హెచ్ఎం రామ్మోహన్, ఉపాధ్యాయుడు నీలి హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రంథాలయ అధికారి ప్రతాపరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఎంఈఓ ఈశ్వరప్ప, సెంట్రల్ హైస్కూల్ హెచ్ఎం రాజేశ్వరి హాజరయ్యారు. కార్యక్రమంలో పీఈటీ మారుతీప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి



గౌతమ్ (ఫైల్)

రాయదుర్గంటౌన్: తీవ్ర జ్వరం, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న రెండో తరగతి చిన్నారి కావలి గౌతమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కాశీపురానికి చెందిన ఆటోడ్రైవర్ కావలి ప్రభాకర్, శైలజ దంపతుల కుమారుడు గౌతమ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. పదిరోజుల క్రితం తీవ్ర జ్వరంతో వివిధ ఆస్పత్రుల్లో చూపించారు. అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌గా బయటపడడంతో అక్కడి నుంచి బాలుడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వారం రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

రోగులతో డబ్బులు వసూలు చేస్తే చర్యలు

కళ్యాణదుర్గం రూరల్: ఆస్పత్రికి వచ్చే రోగులతో డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని వైద్యాధికారిణి ప్రసన్నభారతి హెచ్చరించారు. గురువారం డాక్టర్ ప్రసన్నభారతి విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలోని కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల విభాగంలో సిబ్బంది రోగులతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బ్రహ్మసముద్రం : పశువుల్లో వచ్చే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధి నిర్ధారణ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య అన్నారు. గురువారం చెలిమేపల్లి, గోవిందయ్యదొడ్డి గ్రామాల్లో వ్యాధుల బారినపడి గొర్రెలు, మేకలు మరణిస్తున్నాయని, పశువైద్యాధికారి నవీన్‌కుమార్‌తో కలిసి గొర్రెలు , మేకలను పరిశీలించారు. పశువైద్య సిబ్బంది సుధా, కులశేఖర్, జలీల్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సచివాలయ ఉద్యోగులకు మెమోలు

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామ సచివాలయాల ఉద్యోగులకు మెమోలు జారీ చేసినట్లు గ్రామ కార్యదర్శి ఎంవీ ప్రసాద్ గురువారం తెలిపారు. జేఎల్ఎం దివాకర్, వీఆర్వో నవ్యజ్యోతి, మహిళా పోలీస్ భవాని ప్రతి ఇంటికీ వెళ్లి జియో ట్యాగింగ్ చేయాల్సి ఉందని, అయితే విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడంతో మెమోలు జారీ చేసినట్లు తెలిపారు.

గోల్డ్‌మెడల్ సాధించిన రాకెట్ల సుదీక్షకు సత్కారం



గోల్డ్ మెడల్ సాధించిన సుదీక్షను సత్కరిస్తున్న దృశ్యం

ఉరవకొండ: సెప్టెంబర్ 13న ఢిల్లీలో జరిగిన సౌత్ ఏషియన్ జూనియర్ అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పందెం పోటీలో విజేతగా నిలిచి, రాష్ట్రం తరపున గోల్డ్‌మెడల్ సాధించిన రాకెట్ల సుదీక్షను గురువారం సన్మానించారు. సెప్టెంబర్ 11న చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వంద మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రం తరపున అండర్–20 విభాగంలో పోటీపడి సిల్వర్ మెడల్ సాధించింది. అనంతరం 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. రాకెట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైస్ ఎంపీపీ వై.శ్రీనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత అశోక్, హెచ్ఎం షకీలాబాను ఆధ్వర్యంలో సుదీక్షను అభినందించారు.

ఘనంగా 71వ సహకార వారోత్సవాలు

బ్రహ్మసముద్రం : అఖిలభారత సహకార సంఘం 71వ వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని భైరవానీతిప్ప ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం ఆవరణంలో సహకార సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది కాశాచారి, ఈశ్వర్ , రైతులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆక్రమించారని ఫిర్యాదు

కుందుర్పి: శ్మశానవాటిక ఆక్రమించారని మండలంలోని జంబుగుంపలకు చెందిన 50మంది దళితులు సర్పంచు గంగాధర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాసులుకు గురువారం ఫిర్యాదు చేశారు.

రబీ విత్తన వేరుశనగకు నమోదు చేసుకోండి

గుమ్మఘట్ట: రబీ సీజన్‌లో విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ నిర్మల్‌కుమార్ గురువారం తెలిపారు. రైతుల విస్తీర్ణాన్ని బట్టి వేరుశనగను అందిస్తామని తెలిపారు.

ఎర్రమట్టి తరలించేందుకు యత్నం

కూడేరు: గొటుకూరులో అధికార పార్టీ నాయకులు నల్ల గుట్ట నుంచి బ్రాహ్మణపల్లి వద్ద ఏర్పాటైన ఓ వెంచర్‌లోకి టిప్పర్లతో తోలేందుకు గురువారం యత్నించారు. టిప్పర్ మట్టి రూ.5 వేలుతో తోలేలా ధర మాట్లాడుకున్నారు. జేసీబీ పెట్టి టిప్పర్‌తో మట్టి తోలేందుకు సిద్ధపడగా ఉన్నతాధికారులకు సమాచారం అందింది. అధికారులు అక్కడికి వెళ్లేలోపు అధికార పార్టీ నాయకులు టిప్పర్లను తీసుకొని వెళ్లిపోయారు.

కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం

గుమ్మఘట్ట: కేన్సర్‌పై విజయం.. స్క్రీనింగ్ పరీక్షలతో సాధ్యమవుతుందని పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. మండలంలోని తాళ్లకెర, పూలకుంట, రంగసముద్రం గ్రామాల్లో విలేజ్ హెల్త్ సెంటర్లలో జరుగుతున్న కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు బాలాజీనాయక్, సందేశ్‌కుమార్, సీహెచ్ఓ మురళీధర్ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని నిరసన



మోరేపల్లిలో నీటి సమస్య పరిష్కరించాలని రోడ్డుపై బైఠాయించిన మహిళలు

కళ్యాణదుర్గం రూరల్: తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలియజేశారు. గురువారం మండలంలోని మోరేపల్లిలో గత పదిరోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. దీంతో గ్రామానికి చెందిన మహిళలు కళ్యాణదుర్గం వెళ్లే ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ వారంరోజులుగా గ్రామంలో నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కనీసం పశువులకు నీరులేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నీటి కష్టాలు పట్టించుకునేనాథుడేలేరన్నారు. స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్పందించి తమ గ్రామంలోని నీటి సమస్య పరిష్కరించాలని గ్రామ మహిళలు కోరారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

రాయదుర్గంటౌన్: హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.మల్లికార్జున విమర్శించారు. డిమాండ్లతో తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ప్రజాపోరు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. సీపీఎం నాయకులు నాగరాజు, తిమ్మరాజు, తిప్పేస్వామి, ఓబులేషు, శంకర్, శివ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. గురువారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాల యం ఎదుట ధర్నా చేసి ఆర్డీఓ కార్యాలయంలోని ఏఓ ఈశ్వరమ్మకు వినతిపత్రం అందించారు. జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ మాట్లాడారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. సీపీఎం మండల కార్యదర్శి విరూపాక్షి , మండల సహాయ కార్యదర్శి సుధాకర్, నాయకులు శివ, నాగన్న, సుధాకర్, చిన్న పెద్దన్న, భాషా,షెక్షావలి, మహిళా నాయకురాలు రంగమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని నారాయణపురంలో వాల్మీకి జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. సర్పంచు సుగుణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశులు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. మహిళలు కళశాలతో గ్రామంలో ఊరేగించారు. నాయకులు సంజీవరాయుడు, వన్నూరస్వామి, సంజీవరాయుడు, చెన్నమల్లప్ప, హనుమంతురాయుడు పాల్గొన్నారు.